ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025 5 అనంతపురం



40 మంది విద్యార్థులు.. ఒకే ఉపాధ్యాయుడు..!



కుందుర్పి మండలం బసాపురం గ్రామ పాఠశాలలో ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని బసాపురం గ్రామంలో మండల ప్రాథమిక పరిషత్(ఎంపిపి) పాఠశాల ఉంది. అందులో 40 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే కేవలం ఒకే ఉపాధ్యాయుడు ఉండడం, ఆయన కూడా ప్రధానోపాధ్యాయులు కావడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందడం లేదని వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గతంలో ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రాధానోపాధ్యాయుడు ఉండేవారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించ లేదు. జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి మరొక ఉపాధ్యాయుడని తక్షణమే నియమించాలని గ్రామ సర్పంచి లలితమ్మబొమ్మయ్య కోరారు.





టిడ్కో గూ[గో]డు..!

- కొనసాగుతున్న పనులు
- దశాబ్దకాలంగా లబ్ధిదారుల ఎదురుచూపు
- ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారుల ఖాతా నుంచి డబ్బులు కట్
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రభుత్వాలు మారుతున్నా పేదల సొంతింటి కల సాకరమవడం లేదు. దశాబ్ధ కాలం క్రితం టిడ్కో రూపంలో పేదలకు సొంతింటిని అందించేందుకు చేపట్టిన నిర్మాణాలు ఇప్పటికీ పూర్తవలేదు. పదేళ్లు పూర్తవుతున్నా ఇంకా ఇంటి తాళం లబ్ధిదారునికి చేరలేదు. టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారని లబ్ధిదారులు ఇప్పటికీ ఎదురు చూస్తూనే ఉన్నారు. వీటిపై పాలకుల ప్రకటనలు తప్పా క్షేత్ర స్థాయిలో ఎలాంటి ముందడుగూ పడడం లేదు.

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణ ప్రాంతాల్లో పేదలకు సొంతింటిని ఇవ్వాలన్న ఉద్దేశంతో 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం టిడ్కో గృహ నిర్మాణాలను చేపట్టింది. ప్రభుత్వం, లబ్ధిదారుని వాటాతో అపార్ట్‌మెంట్ తరహాలో వీటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇలా కదిరి పట్టణ సమీపంలోని గట్లు వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. కదిరిలో టిడ్కో గృహాలకు సంబంధించి 1104 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరికి ఒక్కో బ్లాకులో 48 ప్లాట్ల ప్రకారం 23 బ్లాక్‌లతో నిర్మాణం చేపట్టారు. టిడిపి అధికారంలో ఉన్నంత కాలం ఈ పనులు జరిగాయి. నిర్మాణ పనులు 60 శాతం చేరుకునే సమయంలో 2019లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి వచ్చాక టిడ్కోపై నీలినీడలు కమ్ముకున్నాయి. దాదాపు రెండేళ్లు మౌనంగా ఉన్న ఆ ప్రభుత్వం ఆ తర్వాత వీటి నిర్మాణంపై దృష్టి సారించింది. అయినా నిర్మాణ పనులను పూర్తి స్థాయిలో చేయలేకపోయింది. ఈ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల వాటా కింద డబ్బులనూ కట్టించుకుని, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం అందించే ఏర్పాటు చేశారు. 2022లో లబ్ధిదారుల వాటాగా రూ.25వేలు కట్టించుకుని మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ ద్వారా రుణం మంజూరు చేయించారు. రుణం మంజూరు చేసినట్లు కనబరిచినా లబ్ధిదారుని ఖాతాలోకి ఈ డబ్బు పడగానే ప్రభుత్వం దానిని వెనక్కు తీసుకుంది. నిర్మాణాలు జరుగుతుండగానే వైసిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయించారు.

లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు కట్

టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంకు ఖాతా నుంచి బ్యాంకర్లు రుణ వసూలు పేరుతో డబ్బులను కంతుల రూపంలో కట్ చేసుకుంటున్నారు. తమకు ఇళ్లు ఇంత వరకు ఇవ్వలేదని అలాంటప్పుడు ఖాతాలో డబ్బులు ఎలా తీసుకుంటారని లబ్ధిదారులు బ్యాంకర్లను అడిగితే వారు తమకేమీ సంబంధం లేదని చెబుతున్నారు. సొంతింటి కల నెరవేరకపోగా కాయాకష్టంతో బ్యాంకులో దాచుకున్న డబ్బులను కంతుల పేరుతో పోగొట్టుకుంటున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాలకు అంకురార్పన చేసిన టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న నేపథ్యంలో వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి తమకు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇళ్లు ఇవ్వకుండానే డబ్బుల వసూలు



టిడ్కో గృహాలు కోసం గత ప్రభుత్వం బ్యాంక్ నుంచి రుణం మంజూరు చేయించి నట్లు ప్రకటించింది. ఖాతాలోకి డబ్బులు పడగానే మళ్లీ వారే వెనక్కు తీసుకున్నారు. గృహాలు మాత్రం ఇప్పటికీ పూర్తవలేదు. గత ఆరు నెలలు నుంచి తమ బ్యాంక్ ఖాతాలో నగదును టిడ్కో రుణానికి అంటూ తీసుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలి. టిడ్కో గృహాలను అందించి, బ్యాంకర్లు తమ ఖాతా నుంచి డబ్బులు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

విమలమ్మ, టిడ్కో లబ్ధిదారురాలు, కదిరి పట్టణం.

రుణ వసూలు వాస్తవమే..

టిడ్కో గృహాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి బ్యాంకర్లు కంతులు వసూలు చేస్తున్న మాట వాస్తవమే. ఇది రాష్ట్ర స్థాయి సమస్య ప్రస్తుతం లబ్ధిదారులు టిడ్కోకు ఇచ్చిన బ్యాంక్ ఖాతాలో లావాదేవీలు చేయకుండా కొద్ది రోజులు ఉంటే మంచిది. ప్రభుత్వం త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతుంది.

అవినాష్, టిడ్కో నివాసాల అధికారి.



కదిరిలో టిడ్కో గృహాలు

ఫ్యాన్ గూటికి శైలు

- జగన్ సమక్షంలో చేరిక
- శింగనమలను అప్పగిస్తారా..?



జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్న శైలజనాథ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాకే శైలజనాథ్ పార్టీ మార్పు విషయంలో ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. గత రెండు నెలలుగా ఆయన వైసిపిలో చేరుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. ఇందులో భాగంగానే డిసెంబర్ 26వ తేదీన కర్నూలులో ఓ వైసిపి నాయకుని వివాహ వేడుకల్లో పాల్గొన్న జగన్‌మోహన్‌రెడ్డిని శైలజానాథ్ కలిశారు. అప్పట్లోనే ఆయన వైసిపిలో చేరుతారంటూ ప్రచారం నడిచింది. అయితే పార్టీ మార్పు వెంటనే జరగలేదు. త్వరలో జగన్మోహన్‌రెడ్డి జిల్లాల పర్యటనలు ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ రాజకీయంగా, సంస్థాగతంగా బలపడే చర్యలపై దృష్టి సారించింది. అందులో భాగంగానే పార్టీలో చేరికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి శైలజానాథ్‌కు వైసిపి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పార్టీలో చేర్చుకుంది. శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి శైలజానాథ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శైలజానాథ్ వెంట అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వరరెడ్డిలు ఉన్నారు.

శింగనమల బాధ్యతలు అప్పగిస్తారా..?

శైలజానాథ్ చేరిక అంశంపై శింగనమల నియోజకవర్గం వైసిపిలో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం శైలజానాథ్ పార్టీలో మాత్రమే చేరారు. ఈయనకు ఏ నియోజకవర్గం బాధ్యతనూ ఆ పార్టీ అప్పగించలేదు. కాగా శైలజానాథ్ శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009లో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగానూ పని చేశారు. శైలు మద్దతుదారులు ఎక్కువ మంది ఆ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను అదే నియోజకవర్గంలో కొనసాగిస్తారా.. లేక ఇతర నియోజకవర్గం బాధ్యతలు అప్పగిస్తారా అన్న దానిపై భవిష్యత్తులో తేలాల్సి ఉంది. ప్రస్తుతం శింగనమల బాధ్యతలను మాజీ పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మన్ ఆలూరి సాంబశివారెడ్డి చూస్తున్నారు. గత ఎన్నికల్లో శింగనమల వైసిపి అభ్యర్థిగా ఎం.వీరాంజినేయులు పోటీ చేసి టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో ఓడిపోయారు.

ఎన్నికల ముందు నుంచి ఊహాగానాలు

ఎన్నికలకు ముందు శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నట్టు ప్రచారం నడిచినా అది జరగలేదు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండటమే కాకుండా ఆ పార్టీ తరుపున 2024లో శింగనమల నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆఎన్నికల్లో ఆశించిన ఓట్లు ఏమీ పెద్దగా ఆయనకు రాలేదు. ఇటీవల వైసిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంత వెంకటరామిరెడ్డి తనకున్న పాత పరిచాయల కొద్ది ఆయన్ను వైసిపిలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. వైసిపి నుంచి శింగనమల అసెంబ్లీ నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగిస్తే బాగుంటుందన్న అభిప్రాయంతోనే ఆయన్ను వైసిపిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేసారని ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. ఈయన రావడంతో అంతకు ముందున్న శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డికి కాకుండా శైలజానాథ్‌కు బాధ్యతలు అప్పగించడం ద్వారా మేలు జరుగుతుందన్న భావనతో ఈ ప్రయత్నం చేసినట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది. 2024 ఎన్నికల్లోనే అలూరు సాంబశివారెడ్డి భార్య పద్మావతికి కాదని వీరాంజినేయులు అనే వ్యక్తిని వైసిపి అభ్యర్థిగా బరిలో నిలిపారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజినేయులకు టికెట్టు ఇవ్వడం ద్వారా సామాన్యుడికి టిక్కెట్టు ఇచ్చామన్న రాజకీయ ప్రచారానికి ఊపయోగపడింది తప్పా, ఎన్నికల్లో గెలవడానికి దోహదం చేయలేదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గంలో వీరాంజినేయులు టిప్పర్ డ్రైవర్‌గానే జీవితం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ నియోజక వర్గానికి కొత్త సమన్వయకర్తను నియమించాల్సి ఉంది. ఈ తరుణంలో శైలజానాథ్‌ను వైసిపిలోకి తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో ఆయన్నే నియోజకవర్గ సమన్వయకర్తగ నియమించే అవకాశాలున్నట్టు వైసిపి వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. దీనికి ఆ నియోజకవర్గంపై పట్టున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా మద్దతు తెలుపుతుండటంతో ఈ నియోజకవర్గంపై తిరిగి పట్టు సాధించేందుకు వైసిపి ఏ మేరకు ప్రయత్నాలు చేస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

23న 'అనంత కథా కార్యశాల'

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఔత్సాహిక వర్ధమాన రచయితల కోసం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఈనెల23వతేదీన అనంత కథా కార్యశాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రగతి, అంకే శ్రీనివాస్, రవిచంద్ర, ప్రజ్ఞాసురేష్, యమునా రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ రచయితలు జి.వెంకట కష్ణ, వేంపల్లె షరీఫ్, ఆర్.శశికళ, టి.శ్రీనివాసమూర్తి కథా రచనకు సంబంధించిన మెళకువలను వివరిస్తారన్నారు. కథా నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి, సజనాత్మక రచనా పద్ధతులను అనుసరించడానికి కార్యశాల దోహదపడుతుందన్నారు. ఆసక్తి ఉన్న రచయితలు https://forms.gle/arCAmbeEQjCzmXZV లింక్ ద్వారా ఫిబ్రవరి 14వతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో జిప్టో, బ్లింక్ ఇట్, ఉడాన్, కీర్తి మెడికల్స్, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపె నీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 48మంది హాజరవగా 21మందికి ఉద్యోగాలు వచ్చాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జాబ్ మేళాలో సీడప్ జాబ్స్ కోఆర్డినేటర్, కె.సావిత్రమ్మ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బ్రహ్మసముద్రంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, మాజీ కన్వీనర్ రాజశేఖర్ ప్రారంభించారు. శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎపి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటా కనీస మద్దతు ధర రూ. 7,550 ప్రకారం కంద లు కొనుగోలు చేస్తుందన్నారు. మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఓ వైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు.

పుట్లూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన కంది పంటను కొనుగోలు చేసేందుకు మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కనీస మద్దతు ధర క్వింటా రూ.7,550తో కందులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పంట సాగు చేసిన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

రమాబాయి అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-ఉరవకొండ



రమాబాయి అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న అధికారులు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళు లర్పించారు. ఇందులో భాగంగా ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు బెంజిమెన్ ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కుమార్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ కేశవరెడ్డి, చాబాల సర్పంచు జగదీష్, విశ్రాంత ఎంబిహెచ్ఇఓ హాజీ పట్టా కాజా, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎంపి మల్లికార్జున, హెడ్మాస్టర్ కెటి రంగప్రసాద్, విఆర్ఒ పట్టా దాదాఖలందర్, ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ శాంతప్ప, విఆర్ఎ గంగాధర్ పాల్గొన్నారు.

8,9న ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని పాత టివిఎస్ షోరూం ఎదురుగా రాయలసీమ ఆసుపత్రి ఎదురుగా నూతనంగా ప్రారంభించిన అనంత చిన్నపిల్లల క్లినిక్‌లో ఈనెల 8, 9వతేదీల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ భాస్కర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో బిసి, కమ్మ, రెడ్డి, కార్పొరేషన్ల నుంచి రాయితీ రుణాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగించినట్లు ఎంపిడిఓ మురారి నందకిషోర్ తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

చెత్త సేకరణ కేంద్రాల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని అరగటివేముల, కడవకల్లు, ఎస్.గూడూరు గ్రామాల్లోని చెత్త సేకరణ కేంద్రాలను డిఎల్‌డిఓ లలితాబాయి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎలా చెత్త సేకరణ చేస్తున్నారు.. వర్మీకంపోస్టు ఎలా తయారు చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ సక్సెస్ మీట్ ర్యాలీ

అనంతపురం : నగరంలోని 4వ రోడ్డులో ఉన్న భాష్యం స్కూల్ విద్యార్థులు శుక్రవారం ఇంట్రా స్పోర్ట్స్ మీట్ సక్సెస్ ర్యాలీ నిర్వహించారు. జనవరి 30, 31న స్థానిక పిటిసి మైదానంలో ఇంట్రా స్పో ర్ట్స్ మీట్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో 4 బ్రాంచుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతు ప్రదానం చేశారు. ఈ ర్యాలీలో జడ్ఇఓ రవివర్మ, ప్రిన్సిపాల్ ప్రణీత, సబీహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ఇంట్రా స్పోర్ట్స్ సక్సెస్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

శిథిలావస్థలో సర్కారు బడి

- పెచ్చులూడుతున్న పైకప్పు
- భయం గుప్పెట్లో విద్యార్థులు..!



స్లాబ్ నుంచి ఊడి కింద పడిన పెచ్చులు




పెచ్చులూడిన స్లాబ్

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల కేంద్రమైన డి.హీరేహాల్‌లోని కోట ప్రాంతంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక (ఎంపిపి) పాఠశాల శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా తరగతి గదులు కారి నీరు నిలుస్తున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎప్పుడు ఏమి జరుతుతుందో అనే భయంతో ఉపాధ్యాయులు భయం భయంగా పాఠాలను బోధిస్తున్నారు. పిల్లలను పాఠశాలకు పంపేం దుకు విద్యార్థుల తల్లిదండ్రులు జంకుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నిస్తు న్నారు. ఈ పాఠశాలలో 130 మంది విద్యార్థులు ఉండగా 6 తరగతి గదులు ఉన్నా 4 గదులు నిరుప యోగంగా మారాయి. గతంలో నాడు-నేడు కింద ఈ గదుల మరమ్మతుల కోసం రూ. 22 లక్షలు మంజూరయ్యాయి. డివిజనల్ ఇంజినీర్ నాణ్యతను పరిశీలించి మొత్తం గదులన్నింటినీ పడగొట్టి వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాల్సిన అవసరం ఉందని నివేదిక ఇచ్చారు. దీంతో మంజూరైన నిధులు వెనక్కెళ్లాయి. ప్రస్తుతం విద్యార్థులు కమ్యూనిటీ హాలులో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవన స్థితిగతులను గుర్తించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలి లేదా మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

సేవాఘడ్‌లో ఈనెల 13, 14, 15వతేదీల్లో నిర్వహించనున్న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్థానిక కార్యాలయంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వంతోపాటు ట్రస్టు సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, కోశాధికారి బాలానాయక్, ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.బాలాజీనాయక్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చక్రీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం సంప్రదాయం

అనంతపురం : సమాజంలో మహిళలను గౌరవించడం సంప్రదాయంగా అలవాటు చేసుకోవాలని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని ఆదర్శనగర్‌లో ఉన్న డిఎన్‌టి బీసీ బాలుర వసతిగృహంలో బాలికలు, మహిళలు, అమ్మాయిలపై గౌరవంగా మలుచుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు, పేస్టు, బ్రష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఓ రవీంద్రనాథ్‌ఠాగూర్, సిబ్బంది పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయం ప్రారంభం

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో వెలసిన సుంకులమ్మ ఆలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచు వాసుదేవారెడ్డి, రంగారెడ్డి, జయరామిరెడ్డి, ఆవుల శేషారెడ్డి, హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్టించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుల్లారెడ్డి, దుర్గాప్రసాద్, గురు, ఎంపీటీసీ ఎంసి.లాలెప్ప, మాజీ ఎంపీటీసీ రాజన్న, ఎన్ సి.రంగయ్య, మాతంగి రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



డిఆర్ఓ మలోలకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ర్యాపిడో సంస్థను రద్దు చేయాలి

డిఆర్ఓకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్న రాపిడో సంస్థను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు నగర కార్యదర్శి వెంకట్ నారాయణ, భగత్ సింగ్ ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో డిఆర్ఓ మాలోలాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 3న కార్మికులు చేపట్టిన ధర్నా సందర్భంగా డిఆర్ఓ ఇచ్చిన హామీ అమలుపై వచ్చించారు. ఇందుకు స్పందించిన డిఆర్ఓ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తామని పైనుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ కోశాధికారి రామలింగారెడ్డి, మురళి, వెంకట్, రాముడు, కల్లూరు బాషా, పోతలయ్య, ముత్యాలప్ప, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఈరిబాబు బిర్యానీ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం



బిర్యాని సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

నగరంలోని హోటళ్లలో ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. శుక్రవారం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఈరిబాబు బిర్యానీ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. బిర్యాని సెంటర్‌లో నాణ్యమైన ఆహారం అందించాలని నిర్వాహకులు ఈశ్వర్, రితీష్‌ను అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ బిర్యాని సెంటర్‌లో సుచి, శుభ్రతతోపాటు రుచికరమైన వంటకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, జయరామ్, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

బుక్కరాయసముద్రం : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో డాక్టర్ డి.ఇందిరా ప్రియదర్శిని సమక్షంలో హైరిస్క్ గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా రక్తపరీక్షలతోపాటు బీపీ, ఎత్తు, బరువు, మధుమేహ వంటి పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఐరన్‌సు క్రోజ్ ఎక్కించడం, స్కానింగ్‌లకు రాసిచ్చారు. తర్వాత ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. కాగా గర్భిణులు అందరికీ మాజీ సర్పంచు భీమిరెడ్డి గారి బాలనాగిరెడ్డి ఉచిత భోజన వసతి కల్పించారు. పర్యవేక్షకురాలు శ్రీదేవి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మోహన్‌బాబు, హెచ్ఇ పర్వీన్, స్టాఫ్ నర్సులు మంజుల, శ్యామల, ఎల్‌టి కరుణాకర్, ఎంఎల్‌హెచ్‌పి రమేష్, ఆశాలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

ఉరవకొండ : ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి సతీష్‌కుమార్, డాక్టర్ వినీత మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఈనెల 10న పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలందరూ తప్పకుండా మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా అందుబాటులో లేకుంటే 17వ తేదీన వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎంఎస్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ముకుందర్, మోతిలాల్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు లీగల్ మెట్రోలజీ అధికారితో కలిసి విజిలెన్స్ అధికారులు శుక్రవారం నగరంలోని ధన్వి హోండా సర్వీస్, స్పేర్స్, కృష్ణ మొబైల్స్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా తయారీదారుల పేరు, చిరునామా, నికర పరిమాణం, తయారు చేసిన తేదీ, సంవత్సరం, ప్యాకింగ్‌లపై ఎంఆర్‌పి ధర, కన్జూమర్ కేర్ ఫిర్యాదు వివరాలను ముద్రించకపోవడం వంటి లోపాలను గుర్తించి జరిమానా విధించినట్లు డీఎస్పీ నాగభూషణం తెలిపారు. ఈ తనిఖీల్లో సిఐ జమాల్‌బాషా, ఎఒ వాసుప్రకాష్, డిసిటిఒ విజయలక్ష్మి, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు కమిషనర్ బాలాస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 12వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నార్పల : మండల కేంద్రంలోని క్రాసింగ్ సమీపంలో ఉన్న వికలాంగుల కాలనీతోపాటు క్రాసింగ్ లేఔట్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ గంగావతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయా కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించి నీటి సమస్యను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కొద్దిరోజుల నుంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ వికలాంగ కాలనీలో నీటిట్యాంకు ఉందని నీటిని సరఫరా చేస్తే సరిపోతుందన్నారు. అలాగే క్రాసింగ్ లేఅవుట్‌లో నూతన బోరు వేయించి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జనార్ధన్, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చంద్రబాబు, రంజిత్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించాలి

ఉరవకొండ : విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు గుణాత్మకమైన విద్యను అందించాలని సర్పంచు మోనాలిసా సూచించారు. శుక్రవారం వజ్రకరూరు ఎపి మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను సర్పంచు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్లో చదువుతున్న బాలికలు చదువు పట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నత చదువులు చదివి సమాజంలో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులందరూ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందిస్తున్నారా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు, శివపార్వతి, నాగేశ్వరి, హాస్టల్ వార్డెన్ లక్ష్మి, ట్యూటర్ హేమలత, బాలికలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-శింగనమల

ఉద్యోగాలు సాధించిన బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి అభినందించారు. లూమెన్ క్వెస్ట్-2025 హ్యాకథాన్ ఈవెంట్ ద్వారా లూమెన్ టెక్నాలజీస్ నుంచి నలుగురు విద్యార్థులు కళాశాలలో చదువుతూ ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.30వేలు, ఆరునెలల తర్వాత 7.5 ఎల్‌పిఎ వరకూ పూర్తి సమయం ఉపాధి అందించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా విద్యార్థులు ఉద్యోగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్న కళాశాల సిబ్బందిని అభినందించారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-తాడిపత్రి



అంబేద్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రామాంజనేయులు, జుబేర్ విధుల్లో మార్పు చేసి ఇబ్బందులు గురి చేస్తుండటాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన శుక్రవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నరసింహ, ఉమాగౌడ్ మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల విధుల్లో మార్పులు చేసినప్పుడు కార్మికులు అందరికీ చేయాలిగానీ, కేవలం ముగ్గురికి మాత్రమే మార్పులు చేయడాన్ని చూస్తే కక్షసాధింపు చర్య అని అర్థం అవుతుందన్నారు. కమిషనర్ వెంటనే స్పందించి కార్మికులను వేధింపులు గురి చేయకుండా యథావిధిగా విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలను జిల్లావ్యాప్తంగా ఉధృతం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మున్సిపల్ యూనియన్ నాయకత్వం జుబేర్ బాషా, ప్రసాద్, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి రూ.630 కోట్ల లక్ష్యం

జెసి శివ్ నారాయణ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

ఈ ఏడాది మార్చినెల నాటికి రూ.630 కోట్ల లక్ష్యం దిశగా ఎడిసిసి బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలని ఎడిసిసిబి పర్సన్ ఇన్‌ఛార్జి, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకును లాభాల బాటలో పయనించేందుకు కృషి చేయడంతోపాటు రైతులు, అర్హులైన వారికి రుణాలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. సమిష్టి కృషితో మార్చి నెల చివరికి లక్ష్యం చేరుకోవాలన్నారు. ఇదేక్రమంలో మార్చి 31వ తేదీలోగా వాయిదా మీరిన రుణాలపై నూరు శాతం లీగల్ కవరేజ్ చేసి మొండి బకాయిలను వసూలు చేసి బ్యాంకు నిరార్థక ఆస్తులను ఐదు శాతం లోనికి తీసుకురావాలని సూచించారు. అలాగే వందశాతం కెవైసి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ సురేఖారాణి, జిల్లా సహకార అధికారి అరుణకుమారి, ఎటిఎం రామ్‌ప్రసాద్, విజయ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, అదనపు ఎఎన్ఎంలకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. తీవ్ర వేడి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రోగులకు చేసే చికిత్సపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సమాజంలో మార్పు తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ముఖ్యంగా క్లైమేట్ మార్పుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో వారికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ పొందిన వారు తమ నేర్చుకున్న విషయాలను గ్రామస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఇబి.దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి, స్వస్తి సంస్థ క్లైమేట్, హెల్త్ విభాగం లీడ్ నిమిషా హెరెరా నిమ్మగడ్డ, స్వస్తి డైరెక్టర్ ఉమాశంకర్, టెక్నికల్ స్పెషలిస్ట్ (స్వస్తి) వేదిక టి, ప్రోగ్రాం అసోసియేట్ (స్వస్తి) తన్మయే, ఎవిడెన్స్ స్పెషలిస్ట్ (స్వస్తి) పవిత్రా తోకమూరి, సీనియర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డేనియల్ డి పైవా ఎం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల పనితీరు మారకపోతే చర్యలు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నియోజకవర్గ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఐసిడిఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఎన్ని అంగన్వాడీ భవనాలు ఉన్నాయి, వీటిలో ఎన్ని సొంత భవనాలు, ఎన్ని అద్దె భవనాలు, వాటికి ఎన్ని గ్రాంటులు వస్తున్నాయా..లేదా.. తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులను వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పనితీరు ఏ మాత్రం సరిగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలు సమయానికి తెరుచుకోవడం లేదన్నారు. అంతేగాకుండా కేంద్రాల్లో టీచర్లు ఉండకుండా ఆయాల మీద వదిలేసి వెళుతున్నారని, ఇది ఎంతమాత్రం సరికాదన్నారు. అలాగే కోడిగుడ్లు, చిక్కీలు, ఇతర ఆహార పదార్థాలు నాణ్యత ఎక్కడా చూడటం లేదన్నారు. గర్భిణులు, పిల్లలపై కొందరు దురుసు ప్రవర్తన కనిపిస్తోందని.. ఈ పద్ధతిలో కచ్చితంగా మార్పు రావాలన్నారు. ప్రభుత్వ అందించే సరుకులు సరైన మోతాదులో లబ్ధిదారులకు ఇవ్వాల్సిందేన్నారు. ఇక నుంచి వీటిలో మార్పు రాకపోతే చర్యలు కచ్చితంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలు కచ్చితంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పీడీ వనజా అక్కమ్మ, సిడిపిఒలు లలిత, ధనలక్ష్మి, సూపర్‌వైజర్లు కొండమ్మ, విష్ణువర్ధిని, విజయలక్ష్మి, లీలావతి, ఝాన్సీ, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' కమిషనర్‌గా బాలస్వామి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ బి.బాలస్వామి

అనంతపురం నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బి.బాలస్వామి శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తూ బదిలీపై అనంతపురం కార్పొరేషన్‌కు వచ్చారు. అనంతరం కమిషనర్‌కు కార్యాలయం మేనేజర్, రెవెన్యూ అధికారి లక్ష్మీదేవి, విజయకుమార్, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ భాస్కర్, డిప్యూటీ డిఇ బిఎల్.నరసింహ, టౌన్ ప్లానింగ్ టిపిఒ శిరీషా, దుర్గాంజలి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

అనంతపురం : అనంతపురం నగరపాలక సంస్థలో అవినీతి అనే పదం వినపడకుండా చేయడంతోపాటు పారిశుధ్య విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ బాలస్వామి శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలపై సీరియస్‌గా ఫోకస్ పెట్టాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో రాజీపడవద్దని ఆదేశించారు. నగరపాలక సంస్థలో అవినీతి మచ్చను తుడిచివేయాలన్నారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీటెక్ పరీక్ష ఫలితాలను పరీక్షలు విభాగం డైరెక్టర్ వి.నాగప్రసాద్‌నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్, శేఖర్‌రాజు, ఎం.అంకారావు, ఎస్.శ్రీధర్ కలిసి శుక్రవారం విడుదల చేశారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా మందిర ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాబా విగ్రహాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

సచివాలయాల తనిఖీ

యల్లనూరు : మండలంలోని 85 నిట్టూరు, పెద్ద మల్లేపల్లి గ్రామాల్లోని సచివాలయాలను డిఎల్‌డిఒ లక్ష్మీబాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండలంలోని అధికారులు, సచివా లయం సిబ్బంది పనితీరుతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్, పంచాయతీ కార్యదర్శులు సలీంబాషా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పట్టణ, మండల కన్వీనర్ల ఎంపిక



పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి



మండల అధ్యక్షులు జి.గంగరాజు

గుత్తి : వైసిపి గుత్తి పట్టణ అధ్యక్షులుగా కప్పల బండ మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షులుగా జి.గంగరాజు నియమతులయ్యారు. ఈ మేరకు అధిష్టానం నుంచి ఆదేశాలు జారీ అయ్యియి. పట్టణంలోని బిసి కాలనీలో నివాసం ఉండే కె.మధుసూదన్‌రెడ్డి, బేతపల్లి గ్రామానికి చెందిన జి.గంగరాజు వైసిపిలో చురుగ్గా వ్యవహరిస్తుండడంతో వారిని పట్టణ, మండల కన్వీనర్లుగా నియమించారు. నూతనంగా ఎన్నికైన వారికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాటు పడతామన్నారు. తమ ఎన్నికకు కారణమైన మాజీ సిఎం జగన్, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విడపనకల్ అధ్యక్షులుగా కురుబ రమేష్



ఉరవకొండ : వైసిపి విడపనకల్ మండల అధ్యక్షునిగా డోనేకల్ గ్రామానికి చెందిన కురుబ రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు అధినేత జగన్ ఆదేశాలతో కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. కాగా కురుబ రమేష్ 2019లో ఉరవకొండ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పని చేశారు. తనపై నమ్మకం ఉంచి తన ఎన్నికకు సహకరించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డితోపాటు మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యాడికి మండల కన్వీనర్‌గా ఎం.సంజీవరాయుడు

యాడికి : యాడికి వైసిపి మండల కన్వీనర్‌గా ఎం.సంజీవరాయుడు శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంజీవ రాయుడు మాట్లాడుతూ యాడికి మండల కన్వీనర్‌గా తనను ఎంపిక చేసినందుకు అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాయదుర్గం కన్వీనర్‌గా జి.రామాంజనేయులు




రాయదుర్గం రూరల్ : జిల్లాలో పలు మండలాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నూతన కన్వీనర్లను ఎంపిక చేసింది. అందులో రాయదుర్గం మండల కన్వీనర్‌గా జి.రామాంజనేయులును నియమించింది. ఆయన మాట్లాడుతూ మండలంలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామి రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మెట్టు విశ్వనాథ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకొని అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడతామన్నారు.

బ్రహ్మసముద్రం...చంద్రశేఖర్‌రెడ్డి



బ్రహ్మసముద్రం : వైసిపి మండల నూతన కన్వీనర్‌గా పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లా అధిష్టానం, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచనల మేరకు పార్టీ కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారన్నారు. నూతన కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి మండల కన్వీనర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

బొమ్మనహాల్ ... రామాంజనేయులు



బొమ్మనహాల్ : వైసిపి మండల కన్వీనర్‌గా రామాంజనేయులు రెండోసారి నియమితులయ్యారు. ఆయన ఎంపిక పట్ల ఆ పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ రామాంజనేయులు మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.

డి.హీరేహాల్....రవీంద్రనాథ్‌రెడ్డి



డి.హీరేహాల్ : వైసిపి మండల నూతన కన్వీనర్‌గా తనను నియమించినట్లు గొడిసెలపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ మండలంలో వైసిపిని మరింత బలోపేతం చేస్తామన్నారు.

కుందుర్పి...హనుమంతరాయుడు



కుందుర్పి : వైసిపి మండల నూతన కన్వీనర్‌గా కురుబ హనుమంతురాయుడు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై నమ్మకం నుంచి మండల కన్వీనర్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండలంలో వైసిపి బలోపేతానికి నిరంతరం పని చేస్తానన్నారు. తనకు అన్నివిధాలా సహకరించిన మండల, జిల్లా కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కుందుర్పి ఎంపికపై అభ్యంతరం...!

కుందుర్పి మండల కన్వీనర్‌ను ఏకపక్ష నిర్ణయంతో నియమించడం తగదని వైసిపి సీనియర్ నాయకుడు తూముకుంట గంగాధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ఉన్న వైసిపి నాయకులకు పార్టీలో ఎలాంటి పదవులు ఇచ్చే ప్రసక్తే లేదనే నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య గత సమావేశంలో స్పష్టం చేశారన్నారు. అయితే ఇప్పుడు ఎవరి అభిప్రాయం తీసుకోకుండా మండల కన్వీనర్‌ను ఏకపక్షంగా ఎంపిక చేయడం వైసిపి కురుబ సీనియర్ నాయకులను అవమానం పరచడమే అన్నారు. ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరాడు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రితో ఎంపి అంబికా భేటీ

అనంతపురం రూరల్ : కేంద్ర భారత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజుజును శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రానికి చెందిన ఎంపిల బృందం కలిసింది. ఇందులో భాగంగా అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జిల్లాకు సంబంధించిన కీలక సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లా అనంతపురం కావడంతో ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలని విన్నవించారు. అంతేగాకుండా ఇదే అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

యల్లనూరు విద్యుత్ ఎఇగా రవీంద్ర



యల్లనూరు : యల్లనూరు మండల విద్యుత్ ఎఇగా రవీంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా రాజంపేట నుంచి బదిలీపై యల్లనూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు విద్యుత్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

నేరాలు ఘోరాలు

గడ్డివామి దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్ : శెట్టూరు మండలంలోని ములకలేడు గ్రామపంచాయతీలోని రంగయ్యపాలెం వద్ద రైతు బోయ బడిగె కిష్టప్పకు చెందిన గడ్డివామి శుక్రవారం అగ్నికి ఆహుతైంది. పశువుల మేత కోసం రైతు సుమారు 10 బండ్ల వేరుశెనగ పొట్టు, రాగి గడ్డిని కలిపి వామిగా వేశాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం మొత్తం కాలి బూడిదైంది. దీంతో సుమారు రూ. 3 లక్షలు నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని, అధికారులు తనను ఆదుకోవాలని బాధిత రైతు బడిగె కిష్టప్ప కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుట్లూరు : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాలాపురం గ్రామానికి చెందిన రాజేష్ తాడిపత్రికి వెళ్తుండగా.. నాయకునిపల్లి గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి తాడిపత్రి నుంచి స్వగ్రామానికి వస్తుండగా పుట్లూరు సబ్‌స్టేషన్ వద్దకు ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.